తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



# ఉపాధి కూలీకి వెండినాణాలు లభ్యం

**మట్టి తవ్వుతుండగా రాతిపాత్రలో నాణాలు**

**సమాచారం తెలుసుకుని స్వాధీనం చేసుకున్న అధికారులు**

**సిద్దిపేట,మే30:** ఉపాధి పనులు చేస్తున్న ఓ కూలీకి పురాతన కాలం నాటి వెండినాణాలు లభించాయి. మట్టి తీవ్వుతుండగా ఓ చిన్న డబ్బాలాంటిది దొరికింది. దానిని తెరిచి చూడగా అందులో పాత నాణాలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయిపల్లి గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు ఓ రాతి పాత్ర దొరికింది. దీంతో తొలుత రాతి పాత్రను ఓపెన్ చేసేందుకు కూలీలు భయపడ్డారు. కొంతమంది కూలీలు దానిని తెరిచి చూశారు. ఆ పాత్రలో పురాతన కాలం నాటి 25 వెండి నాణెళిలు, రెండు వెండి ఉంగరాలు లభ్యమయ్యాయి. పురాతన నాణెములు దొరికిన విషయాన్ని గ్రామస్తులు బహిర్గతం చేయగా చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో రామ్మోహన్ తదితర అధికారులు గ్రామానికి చేరుకొని, కూలీలకు దొరికిన నాణెళిలను పరిశీలించారు. ఇవి నిజాం కాలం నాటి నాణెములుగా భావిస్తున్నట్లు తెలిపారు. వాటిని వెంటనే స్వాధీనం చేసుకున్నారు. ఈ నాణెములు, ఉంగరాలను పురావస్తు శాఖకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

## తెలంగాణ పీజీఈసెట్ హాల్‌టికెట్లు విడుదల

**హైదరాబాద్,మే30:** తెలంగాణ స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) 2024 పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదల అయ్యాయి. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను మిగతా 2లో..

# విత్తన కంపెనీలు సక్రమంగా పనిచేయాలి

**అవసరమైన విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయాలి**

**యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం విత్తనాల సరఫరా**

**అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల**

**హైదరాబాద్,మే30:**
విత్తన కంపెనీలు ప్రణాళిక ప్రకారం ప్రత్తి విత్తన ప్యాకెట్లను జూన్ 5లోగా జిల్లాలకు చేర్చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. అదేవిధంగా కొన్ని జిల్లాల్లో ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో ఒక కంపెనీకి చెందిన ఒకే రకమైన విత్తనాలనే రైతులు కోరుతున్నారని తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అలా కాకుండా యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం మార్కెట్లో లభ్యమవుతున్న అన్ని విత్తన హైబ్రిడ్ల దిగుబడి ఒక్కటేనని ఈ విషయాన్ని రైతులందరికీ సంబంధిత కంపెనీలు తెలియజేయాలని సూచించారు. ప్రతిరోజు జిల్లావారి, కంపెనీవారిగా ప్రత్తివిత్తన ప్యాకెట్ల పంపిణీ, కొనుగోలు వివరాలను మిగతా 2లో..





# విత్తనాలు అడిగితే లాఠీఛార్జా?

**ఇదేనా కాంగ్రెస్ రైతు ప్రభుత్వం**

**మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే జోగురామన్న**

**హైదరాబాద్,మే30:** రైతుల సమస్యల పక్కన పెట్టి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. పత్తివిత్తనాల కోసం రైతులు రోడ్డెక్కుతున్నా పట్టింపు లేకుండా పోయిందన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..దిలాబాద్ లో అడిగిన పత్తి విత్తనాలను ఇవ్వకుండ రైతులపై లాఠీ ఛార్జ్ చేశారని మండిపడ్డారు. రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచాలని, లేకుంటే రైతులతో కలసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతుల సమస్యల పక్కన పెట్టి తెలంగాణ రాజ ముద్రను మార్చే పనిలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నాడని, ఉప ముఖ్యమంత్రి వేరే రాష్టాల్లో ప్రచారం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కొత్త మద్యం టెండర్ల విషయం తనకు మద్యం మంత్రి జూపల్లి కృష్ణారావు అంటున్నాడన్నారు. ట్యాక్స్ ల పేరుతో వసూల్ చేసిన డబ్బులను ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక రైతుల పరిస్థితి ఆగమైందని, చెప్పులు, బట్టలు లైన్ లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలు ఎండిపోయి 250 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. రైతు భరోసా ఎప్పటి వరకు ఇస్తారో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పాలని ఆయన డిమాండ్? చేశారు.

# జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో బెట్టింగ్ కలకలం

## యువత, నిరక్ష్యరాస్యులలే లక్ష్యంగా బెట్టింగ్ రాకెట్

**జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో క్రికెట్ బెట్టింగ్ కలకలం రేపుతోంది. ఇటివల ఆన్లైన్లో బెట్టింగ్ పాల్పడుతూ పోలీసులకు చిక్కిన గ్యాంగ్ తీగ లాగితే మొత్తం బెట్టింగ్ రాకెట్ డొంక కదులుతున్నది. గ్రామీణ ప్రాంతంలోని యువత, నిరక్ష్యరాస్యులను లక్ష్యంగా చేసుకొని నగదు, భూమి, వాహనాలు, బంగారు అభరణాలు దోచుకుంటున్నారు. ఈ క్రికెట్ బెట్టింగ్ దందాలో ఓ ఎస్సై కుమారుడు వ్యవహారం హాట్ టాపిక్గా మారడంతో జిల్లా ఎస్పీ ప్రత్యేక దర్యాప్తు చేయిస్తున్నారు.**

**జోగులాంబ గద్వాల,మే30:**
ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నడిగడ్డలో క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ యథేచ్ఛగా సాగుతోంది. ఆన్ లైన్ లింక్‌లు, వాట్సాప్ గ్రూప్‌ల్లో మెసేజ్‌ల ద్వారా లింక్‌లు పంపి బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఇటివలే జోగులాంబ గద్వాల్ జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా మొత్తం బెట్టింగ్ మాటున జరుగుతున్న అసలు దందా బట్టబయలు అయింది. బెట్టింగ్ డబ్బుల కోసం భూములు, వాహనాలు, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టించుకోవడం, అనంతరం వాటిని సొంతం చేసుకునే వ్యవహారం జిల్లాలో సంచలనంగా మారింది. ఇటివలే ముగిసిన మిగతా 2లో..



# అందెశ్రీ గీతంపై బిఆర్ఎస్ రాద్ధాంతం

**ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ఆగ్రహం**

**రాజన్న సిరిసిల్ల,మే230:** జయ జయహే తెలంగాణ గీతంపై బీఆర్ఎస్ నాయకులు అనవసరపు రాద్దాంతం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ఫైరయ్యారు. ప్రముఖ తెలంగాణ కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా కాంగ్రెస్ సర్కార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మిగతా 2లో..



## తెలంగాణ పీజీఈసెట్ హాల్‌టికెట్లు విడుదల

మొదటిపేజీ తరువాయి..

అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెలంగాణ పీజీఈసెట్ 2024 పరీక్ష జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్ష జరుగుతుంది. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుంది. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 12.30 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఈ ఏడాది జేఎన్‌టీయూ హైదరాబాద్ పీజీఈసెట్ పరీక్ష నిర్వహిస్తోంది. పీజీఈసెట్ 2024లో వచ్చిన ర్యాంకు ఆధారంగా 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, అఫిలియేటెడ్ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కాలేజీల్లో ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్, గ్రాడ్యుయేట్ లెవెల్ ఫార్మడీ, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కాగా తెలంగాణ ఈజీఈసెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు 120 మార్కులకు 2 గంటల్లో సమాధానాలు గుర్తించవల్సి ఉంటుంది. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉండదు. ప్రవేశ పరీక్షలో మొత్తం మార్కుల్లో కనీసం 25 శాతం మార్కులు వచ్చిన వారిని మాత్రమే ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు. ఇక ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన విద్యార్థులకు క్వాలిఫైయింగ్ మార్కులు ఉండవు. ఎన్ని మార్కులు వచ్చినా ర్యాంకు కేటాయిస్తారు.

## జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో

# బెట్టింగ్ కలకలం

మొదటిపేజీ తరువాయి..

ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రారంభం నుంచి ఈ దందా జోరుగా సాగిందని పోలీసుల విచారణలో తేలింది. బెట్టింగ్ నిర్వాహణకు ప్రత్యేకంగా ఓ వెబ్ సైట్ క్రియేట్ చేశారు. లాగిన్ వివరాలు ప్రత్యేకంగా లింక్‌ల ద్వారా పంపి నగదు డిపాజిట్ చేయడం, బెట్టింగ్‌లు పెట్టడం నిర్వహిస్తున్నారు. ఇక నిర్వకరాస్యుల కోసం ప్రత్యేకంగా వ్యక్తులను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా నగదు తీసుకొని బెట్టింగ్ కోసం వెబ్ సైట్‌లో మనీ డిపాజిట్ చేయిస్తున్నారు. ఇక కొంత మంది బెట్టింగ్ రాయుళ్ల దగ్గర డబ్బు లేకుంటే వారికి అప్పుల రూపంలో అరెంజ్ చేస్తున్నారు ఈ కేటుగాళ్లు. ఈ అప్పుల వ్యవహారంలో జోగులాంబ గద్వాల్ జిల్లాకు చెందిన ఓ ఎస్సై కుమారుడు కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అమాయకుల వద్ద నుండి భూములు, కార్లు, బైక్‌లు, బంగారు ఆభరణాలు కుదువపెట్టుకొని బెట్టింగ్‌ల కోసం వడ్డీలకు నగదు అందజేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఆ ఎస్సై కూడా పలు ఆరోపణలతో ప్రస్తుతం ఎస్పీ ఆఫీసుకు అటాచ్ చేసినట్లు టాక్ నడుస్తోంది. వీరి పాత్రతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు ఇందులో భాగస్వామిగా ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇక బెట్టింగ్ దందాపై ప్రత్యేక బృందంతో లోతైన దర్యాప్తు చేయిస్తున్నారు జిల్లా ఎస్పీ రితిరాజ్. ఈ వ్యవహారంలో ఎంతటి వారున్నా చర్యలు తప్పవంటూ ఆమె హెచ్చరిస్తున్నారు. గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. అయిజ ప్రధాన కేంద్రంగా జిల్లా మొ-ంత్తం బెట్టింగ్‌లు సాగిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేయగా మరికొంత మంది పరారీలో ఉన్నట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ప్రత్యేక దృష్టితో దర్యాప్తు కొనసాగుతోందని ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన పాత్ర ఎవరిది అనేది త్వరలోనే తేల్చుతామని ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని తల్లితండ్రులకు పోలీసులు సూచిస్తున్నారు. దర్యాప్తు అనంతరం బాధితుల ప్రాపర్టీని తిరిగి రికవరీ చేస్తామని చెబుతున్నారు. ఇక ఈ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్న ఉపేక్షించకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అందెశ్రీ గీతంపై బిఆర్ఎస్ రాద్ధాంతం

మొదటిపేజీ తరువాయి..

ఈ గీతానికి తుది మెరుగులు దిద్దుతుంది సర్కార్. ఆస్కార్ విన్నర్, ప్రముఖ సంగీత దర్శకులు ఎం ఎం కీరవాణి సంగీత సారథ్యంలో ఈ పాటను రీక్రియేట్ చేస్తున్నారు. అయితే, ఆంధ్రవాళ్ల రాష్ట్ర గీతానికి సంగీతం అందించడమేంటని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారిని ప్రశ్నిస్తూ వీడియో విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమం పేరిట అధికారంలోకి వచ్చిన కేసీఆర్ 10 సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించి... కనీసం జయ జయహే తెలంగాణ గేయాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించలేదని విమర్శించారు. నేడు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి.. జయ జయహే తెలంగాణ గేయాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటిస్తామంటే కేసీఆర్, కేటీఆర్ అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు. తెలంగాణ గుండె తడి తెలిసిన అణగారిన వర్గానికి చెందిన అందెశ్రీ రాసిన గేయాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటిస్తే..బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు.

## పాలప్యాకెట్ కోసం వెళితే ప్రాణం తీసిన డిసిఎం

### వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొన్న వ్యాన్

### వ్యక్తి ప్రసాద్ అక్కడికక్కడే మృతి.. చిన్నారి బాబు సేఫ్

హైదరాబాద్,మే30: నగరశివారు ప్రాంతంలో దారుణ ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం పాలప్యాకెట్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి డిసిఎం రూపంలో వచ్చిన మృత్యువుకు బలయ్యాడు. పాల ప్యాకెట్ కోసం ఉదయాన్నే ఆ తండ్రి తన రెండేళ్ల చిన్నారితో కలిసి వెళ్లాడు. ఇంతలోనే డీసీఎం రూపంలో మృత్యువు అతన్ని కబళించింది. ఏం జరుగుతుందో తెలియని ఆ చిన్నారి గాయాలతో తండ్రి మృతదేహం వద్దే కన్నీళ్లు పెడుతూ కూర్చున్నాడు. స్థానికులు సదరు చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. ఈ హృదయ విదారక ఘటన హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్ మెట్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ లోని ఇనాంగూడ వద్ద హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై గురువారం ఉదయం కనకప్రసాద్ అనే వ్యక్తి తన రెండేళ్ల కుమారుడితో కలిసి పాల ప్యాకెట్ తీసుకొచ్చేందుకు వెళ్లారు. ఈ క్రమంలో హైవేపై వీరు వెళ్తున్న బైక్‌ను విజయవాడ నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రసాద్ మృతి చెందారు. బాలుడికి గాయాలు కాగా.. తండ్రి మృతదేహం వద్దే ఏడుస్తూ కూర్చున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఏపీలోని కొవ్వూరు ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు. జీవనోపాధి కోసం 10 రోజుల క్రితమే వీరి కుటుంబం ఈ ప్రాంతానికి వచ్చినట్లు తెలుస్తోంది.



## విద్యార్థుల జీవితాలతో ఐటీడీఏ చెలగాటం

### తప్పిదాలపై విచారణ చేపట్టాలి :గిరిజన సంఘాలు

**వరంగల్,మే30:**

హన్మకొండ, జనగామ,ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి,వరంగల్‌జిల్లాల ఐటీడీఏ పరిధి పాఠశాలలో, హాస్పిటల్స్,సెల్ఫ్‌మేనేజ్‌మెంట్,హాస్టల్స్,వైటీసీఎస్,పీఈటీసీలలో డీటీడీవోల డిపుటేషన్స్ దందా అంతాఇంత కాదని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి.ఈ డిప్యుటేషన్స్‌కు ప్రధాన కారణం గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేనని ఆ సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.ఈ ఆరు జిల్లాలోని పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందంటున్నారు. అక్కడి పాఠశాలల పరిస్థితిని తెలుసుకోకుండ క్రిందిస్థాయి అధికారులు ఇచ్చే తప్పుడు నివేదికలు చూసి ఇదే వాస్తవమని ప్రకటించడం విచారకమని గిరిజన సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నియబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్స్ కొనసాగుతున్నా యని అనేక మార్లు గిరిజన సంఘాలు ఫిర్యాదు చేసిన గిరిజన సంక్షేమ ఉన్నతాధికారులు నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందని వారు వాపోతున్నారు.ఈ డిప్యుటేషన్స్ కారణంగా ఈ ఆరు జిల్లాల్లోని గిరిజన బాలుర, బాలికల పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్, 10వ తరగతి ఫలితాలపై ప్రభావం చూపుతున్నాయని వారు అంటున్నారు. దీంతో పాఠశాలలపై నమ్మకాలు పోతున్నాయి.ఇలా గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఇష్టారాజ్యంగంగా వ్యవహరించటం మూలంగా గిరిజన విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంలో పడుతుందని ఆదివాసి, గిరిజన సంఘాలు వాపోతున్నాయి.

## తెలంగాణలో మళ్లీ మండుటెండలు

### రెండ్రోజుల్లో వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ

**హైదరాబాద్,మే30:** తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. అకాల వర్షాలు ముఖం చాటేయడంతో ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మళ్లీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ తీపికబురు చెప్పింది. రాష్ట్రంలో జూన్ ఒకటి నుంచి



మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. జూన్ ఒకటిన భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే, 2వ తేదీ నుంచి 3వ తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయని చెప్పింది. మరో వైపు నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. రుతుపవనాలు లక్షద్వీప్ ప్రాంతం మీదుగా కేరళలోకి ప్రవేశించాయని పేర్కొంది. రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. కర్ణాటక, తమిళనాడులోని కొన్ని భాగాలు, నైరుతి, మధ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్, సిక్కింలోని పలు ప్రాంతాల్లోకి రాబోయే రెండుమూడు రోజుల్లోనే విస్తరిస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

## రైలుకిందపడి ఇద్దరు మృత్యువాత

**నల్లగొండ,మే30:** నల్లగొండ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గూడ్స్ రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివాహేతర సంబంధమే వీరిని ఆత్మహత్యకు పురిగొల్పిందని అనుమానిస్తున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఇద్దరు రైలుకింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతులు మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం దుర్గానగర్ వాసులుగా గుర్తించారు. వివాహేతర సంబంధమే ఆత్మహత్యకు కారణమని అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విత్తన కంపెనీలు సక్రమంగా

# పనిచేయాలి

మొదటిపేజీ తరువాయి..

పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రత్తి మరియు పచ్చిరొట్ట విత్తనాలు అవసరం మేరకు ఉన్నాయని తెలిపారు. రైతుల అవసరం మేరకు విత్తనాలను ప్రభుత్వ ఆమోదిత దుకాణాల నుంచి కొనాలని సూచించారు. రైతులు విత్తనాలకు సంబంధించి ప్రతి కొనుగోలు బిల్లులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. పత్తి, పచ్చిరొట్ట లభ్యత, విత్తనాల పంపిణీపై రాష్ట్రస్థాయి అధికారులతో వ్యవసాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సమీక్ష నిర్వహించారు. నకిలీవిత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలకు వచ్చిన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్లు, అధికారులకు ఆదేశించారు. సీడ్



కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... జిల్లాల వారిగా నేటికి 68,16,967 వివిధ కంపెనీల ప్రత్తివిత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతా ప్యాకెట్లు కూడా జూన్ 5వ తేదీలోగా జిల్లాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఇప్పటికే అన్ని జిల్లాల్లో రైతుల అవసరం మేరకు ప్రత్తి, జీలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు వివరించారు. విత్తనాలను జిల్లా కలెక్టర్లు రైతులకు సక్రమంగా చేరేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా రైతులు విత్తనాలు కొనుగోలు చేయడానికి భారీ సంఖ్యలో వస్తే కౌంటరులు ఎక్కువ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇకనుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రతినిత్యం పర్యటిస్తూ విత్తనాల విక్రయ కేంద్రాలు, జీలుగ, జనుము సరఫరా చేసే కేంద్రాల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గతవారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు చేసుకొని సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## 2024 విద్యా సంవత్సరానికి ముందే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పట్టవా..?
- ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్ శాతాన్ని తగ్గించాలి
- ఏఐవై ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి




**మేడ్చల్/మల్కాజిగిరి. మే.30(ప్రజా జ్యోతి)** 2024-25 విద్యా సంవత్సరానికి ముందే మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్), బాల సంఘం మేడ్చల్ జిల్లా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం, ఉప్పల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏ ఐ వై ఎఫ్ బృందం సర్వే నిర్వహించడం జరిగింది. ఉప్పల్ మండలంలో కేవలం 30 ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పన కోసం నిధులు మంజూరు చేశారని, కానీ ఉప్పల్ మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ బడులకు నిధులు మంజూరు చేయాలని ఏ ఐ వై ఎఫ్ డిమాండ్ చేస్తున్నది. ఈ సందర్భంగా ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏ ఐ వై ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ లు సంయుక్తంగా మాట్లాడుతూ తాము నిర్వహించిన సందర్శన నేపథ్యంలో సదరు పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని గుర్తించామన్నారు ప్రధానంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు భయానకంగా ఉన్నాయని,తరగతుల కిటికీలకు సరైన డోర్లు లేవని అన్నారు. పాఠశాలకు చుట్టూ మద్యం సీసాలతో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందన్నారు. నీటి కుళాయిలు విరిగి, శిథిలావస్థకు చేరిందని,చెత్తాచెదారాలతో అపరిశుభ్రంగా ఉందని, పాఠశాలలో నీటి సమస్య అతి ప్రధాన సమస్యగా ఉ ందని,తరగతి గదులలో ఉన్న అనేక బెంచ్ లు విరిగి, ఊడిపోయి ఉన్నాయని, తరగతి గదులలో పెచ్చులు ఊడుతున్నాయని, పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు 24వ తెదే నుండి ఇప్పటివరకు అందుబాటులో లేరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ ను కాకుండా దీర్ఘకాలిక దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల మరమ్మత్తులు, మౌలిక సదు-పాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉన్నందున.. వేసవి సెలవులు పూర్తయ్యే లోపుగా ప్రభుత్వ పాఠశాలల్లో మ-రమ్మత్తులను పూర్తి చేస్తే 2024 విద్య సంవత్సర విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించడం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులను చేయవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి, అంశాల వారీగా ఎంపిక చేసి ఆయా పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆ పనులన్నింటినీ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారానే జరిగేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ ఆధీనంలో ఉండే జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్టీ) నిధుల్లో నుంచి పాఠశాలల అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, గిరి బాబు, బాల సంఘం నేతలు కీర్తన్, రవళి, మధురిమ, రమ్య, సౌజన్య, దీప్తి, మోహన్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## వేస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ 8 వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,మే 30 (ప్రజాజ్యోతి):** జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ 8 వ వార్షికోత్సవం కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ,తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్ రెడ్డి,ప్రముఖ హీరో మురళి మోహన్,కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. బిల్డర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారిస్తానని ,తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయి అని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉ ంటానని ఎమ్మెల్యే గాంధీ గారు తెలియచేసారు. నాల సమస్య మరియు బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ ,అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఓలింపిక్ అసోసియేషన్

- జాయింట్ సెక్రటరి బరిలో కొండ విజయ్ కుమార్



**శేరిలింగంపల్లి,మే 30 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఓలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బరిలో తెలంగాణ హాకీ అధ్యక్షుడు,చందానగర్ నివాసి కొండ విజయ్ కుమార్ ఉన్నారు. ఫతేమైదాన్ తెలంగాణ ఓలింపిక్ భవన్ లో ఏన్నికల అధికారికి ఈ మేరకు కొండ విజయ్ కుమార్ నామినేషన్ ను అందచేసారు. జూన్ 9 న తెలంగాణ ఓలింపిక్ భవన్ లో ఏన్నికల జరగనున్నాయి. మాజీ ఏంపి జితేందర్ రెడ్డి ఆద్యక్షుడుగా పోటి చేస్తున్న ప్యానల్ నుండి పోటి చేస్తున్నట్లు కొండ విజయ్ పేర్కొన్నారు. తెలంగాణ ఓలింపిక్ ఆసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా తనకు అవకాశం వస్తే తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తనదైన శైలిలో కృషి చేస్తానని తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండ విజయ్ తెలిపారు.

## ప్రజాజ్యోతి వార్తకు స్పందించిన అధికారులు

- జాజిగుట్ట కాలనీలో నీటి సమస్య లేకుండా చూసుకుంటాం
- చేవెళ్ల ఏఈఈ గీత
- కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్ బుడ్డిని తొలగించి కొత్తది ఏర్పాటు
- విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ బుడ్డి కోసం డబ్బులు అడిగిన వారిపై చర్యలు తీసుకుంటాం
- చేవెళ్ల విద్యుత్ శాఖ ఏఈ మహమ్మద్ జాని మొహినోద్దీన్





ప్రజాజ్యోతి

ఇబ్రహీంపల్లి లో సమస్యలను పరిష్కరించండి

**చేవెళ్ల మే 30(ప్రజా జ్యోతి):** ఇబ్రహీం పల్లి లో సమస్యలను పరిష్కరించండి అని ప్రజా జ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తకు మిషన్ భగీరథ అధికారులు గీత ఏఈఈ, ఇర్ఫాన్ డిఈఈ గ్రిడ్, కుమార్ ఏఈఈ గ్రిడ్ చేవెళ్ల స్పందించి జాజుగుట్ట కాలనీ లో ఉన్న వాటర్ ట్యాంకును పరిశీలించి ఇంటింటి నల్ల వాల్ ను ఓపెన్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏఈఈ గీత మాట్లాడుతూ.. జాజిగుట్ట కాలనీలో ప్రతిరోజు మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి కానీ కాలనీకి సరిపడినంత రావడం లేదని, కొన్ని ఇండ్లవారు గ్రామ ప్రజల అధికారుల కండ్లు గట్టి నల్ల కనెక్షన్ లో ఉన్నటువంటి చెర్ర ను తొలగించి నీళ్లను సంపులలో నింపుకుంటున్నారని ఇండ్లలో బోర్లు ఉన్నవాళ్లు నల్ల నీళ్లను వేస్ట్ గా వదిలేస్తున్నారని,వెంటనే వారిపై తగిన చర్య తీసుకుంటామని తెలిపారు. ఇవాల్టి నుంచి ఈ కాలనీకి ఒక ట్యాంక్ నీళ్లు ఎక్స్ ట్రగా ఇస్తామని నీటి సమస్య లేకుండా చూసుకుంటామని అన్నారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ బుడ్డి కాలిపోయిందని కొత్త బుడ్డి పెట్టడానికి పది వేల రూపాయలు ఖర్చు అవుతుందని అనే వార్తకు విద్యుత్ ఏఈ మహమ్మద్ జానీ మొహినోద్దీన్ స్పందించి మాట్లాడుతూ.... గ్రామ కార్యదర్శిని బుడ్డి కోసం విద్యుత్ శాఖలో డబ్బులు ఎవరు అడిగారో మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం ఆ గ్రామానికి ఇన్చార్జిగా ఉన్న స్పెషలాఫీసర్ స్థానిక ఎమ్మార్వో సూచన మేరకు కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్ బుడ్డిని తొలగించి కొత్త బుడ్డిని ఏర్పాటు చేయాలని సూచించారని మేము కొత్త బుడ్డిని ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో డ్రైనేజ్ సమస్యను కూడా పరిష్కరించాలని గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులను కోరారు.

## జీవన్ అన్న ఆధ్వర్యంలో పనులు చక చక

**ఎల్బీనగర్ ప్రజా జ్యోతి ప్రతినిధి** హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేడు డివిజన్లోని హయత్ నగర్ పాత గ్రామం మరియు సాయి కాలనీ లో శానిటేషన్ అధికారులతో కలిసి పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు రోజుల ముందు ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం వల్ల డివిజన్లోని ప్రతి కాలనీలోను చెట్ల కొమ్మలు విరిగి ఎక్కడపడితే అక్కడ పడడంతో కాలనీ వాసులకు ఇబ్బందికరంగా మారిందని కావున చెట్ల కొమ్మలను తొలగించడానికి రెండు, మూడు రోజులు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయవలసిందిగా శానిటేషన్ డి ఈ లావణ్య కు తెలపడం జరిగింది. ఈ యొక్క పర్యటనలు శానిటేషన్ జవాన్ లక్ష్మయ్య సూపర్వైజర్లు నగేష్ గారు, మల్లేష్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# 54 వ సిఐటియు ఆవిర్భావ దినోత్సవ మహాసభ

- పేదవాన్ని దోచుకుంటున్న కార్పొరేటర్లు
- మార్పు ఎప్పుడు సాధ్యం





**ఎల్బీనగర్ ప్రజా జ్యోతి ప్రతినిధి** సిఐటియు 1970 మే 30న ఆవిర్భవించడం జరిగింది నేటికీ 54 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆటోనగర్లో వార్షికోత్సలు నిర్వహించడం జరిగింది. ఈ వార్షికోత్సలకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, హాజరై మాట్లాడుతూ నేడు సిఐటియు ఆవిర్భవించి 54 సంవత్సరాలు అవుతుందని ఈ కాలంలో కార్మిక వర్గ ఐక్యతకు ఎనలేని కృషి చేసిందని అందులో భాగంగానే కార్మిక వర్గ ఎదుర్కొంటున్న సమస్యలపై 35కు పైగా జనరల్ స్ట్రైక్ నిర్వహించడం జరిగిందని నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలను ఫలితంగా కార్మిక వర్గం అనేక అవస్థలకు గురి అవుతుందని అన్నారు నేడు కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికుల హక్కులన్నీ అరించి వేస్తుందని అన్నారు కావున కార్మిక వర్గం మరింత సంఘటితమై పాలకవర్గాలపై పోరాడి మన హక్కులను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు ఎన్డీఏ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల పైన వారాలు మోపి కార్పొరేట్ శక్తులకు లాభం చేస్తుందని అన్నారు ఈ విధానాల వల్ల దేశంలో 240 మంది చేతుల్లో 40 శాతం సంపద కేంద్రీకృతమై ఉందని ఈ సంపద మొత్తం పేదల శ్రమ దోపిడి ఫలితంగానే జరిగిందని అన్నారు ఈ శ్రమ దోపిడికి వ్యతిరేకంగా కార్మిక వర్గం సంఘటితమై పోరాడి శ్రమకు తగ్గ ఫలితం సాధించుకోవాలని అందుకొరకే సీఐటీయూ ఐక్యత పోరాటంతో ఆవిర్భవించిందని నాటు నిండి నేటి వరకు ఐక్యత పోరాటం నినాదాన్ని విజయవంతం చేస్తూ నిర్వహిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య సిఐటియు నాయకులు దయానంద్ రాజకుమార్ కాటము నాగేష్ కొండల్ సచిన్ రాములు బాలాజీ దయానంద్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

# దొరల ప్రభుత్వంలో ఘనకార్యాలు గుర్తుతెచ్చుకోండి

- జయశంకర్ సార్, కోదండరాం సార్, అందెశ్రీ లను అవమానించింది మీరు కాదా?
- ఫక్తు రాజకీయ పార్టీ పేరుతో ఆంధ్రులకు సభ్యులు కట్టింది మీరు కాదా?
- అయ్యా కేసీఆర్, కేటీఆర్ మీకు ఉద్యమకారులు గుర్తుకు వచ్చారా?
- యాదగిరిగుట్టను యాదాద్రిగా మార్చింది కేసీఆర్ కాదా..
- ఉద్యమకారులను అవమానించింది మీరు కాదా?



**కూకట్ పల్లి,మే 30 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్ ను రెచ్చగొట్టి, అమాయక తెలంగాణ విద్యార్థులు ఆత్మహత్యలకు కారకులు కేసీఆర్ కుటుంబం కాదా అని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షకు కారకులైన ప్రొఫెసర్ జయశంకర్ సార్ లతోపాటు తెలంగాణ రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం అంటూ అద్భుత గీతాన్ని రచించిన అందెశ్రీ, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ గా ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం సార్లను అవమానించిన ఘనత కేసిఆర్ కుటుంబం ఉందని అన్నారు. ప్రస్తుతం అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన రేవంత్ రెడ్డిని సంగీత దర్శకుడు కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారని విమర్శలకు తెరలేపిన బీఆర్ఎస్ నేతలు గురువింద చందంగా తయారయ్యారని అన్నారు. జాగృతి సంస్థను స్థాపించిన కల్వకుంట్ల కవిత ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ పేరుతో కవితమ్మ బతుకమ్మ పాటలు ఏ ఆర్ రెహమాన్ పాడిస్తే అది ఆంధ్రుడు కాదా అని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన చిన్న జీయర్ స్వామి ట్రస్టుకు ఎకరానికి 12 కోట్ల వ విలువగల భూమిని 16 లక్షలకు కట్టబెట్టినారు ఆంధ్ర ఆయన కాదా? కాలేశ్వరం ప్రాజెక్టును లక్షల కోట్ల విలువ గల కాంట్రాక్టును మేఘ కృష్ణా రెడ్డి కి ఇచ్చినారు వారు ఆంధ్ర ఆయన కాదా అని ప్రశ్నించారు. యాదగిరిగుట్ట డిజైను ఆనంద్ సాయి కి ఇచ్చినారు వారు ఆంధ్ర ఆయన కాదా? సినీనటి సమంత కి మన బ్రాండ్ అంబాసిడర్ చేసినారు కోట్ల రూపాయలు ఇచ్చినారు వారు ఆంధ్రమే కాదా అని ప్రశ్నించారు. శారదా పీఠానికి రెండు కోట్ల విలువ గల చేసే భూమిని ఒక రూపాయి కట్టబెట్టింది మీరు వారు ఆంధ్ర కాదా తెలంగాణకు చెందిన గాయకుడు అందెశ్రీ పాడిన గేయానికి సంగీతం ఆస్కార్ అవార్డు కీరవాణి అందిస్తే తప్పింది గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించకపోవడం మీకు సిగ్గుచేటు దాన్ని రాష్ట్ర గీతంగా ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ గుర్తించి తీసుకోవడం ద్వారా ఆమోదించవలసిన విషయం దానికి గగ్గోలు పెట్టడం మీకు సిగ్గుగా లేదా, రాజముద్రలో అమరవీరు స్తూపం ఉంటే తప్పేంది అమరవీరుల త్యాగాల ఫలితం రాష్ట్రం వచ్చిందన్నారు. అధికారం కోల్పోయిన విషాదంలో కేసీఆర్ కుటుంబం టిఆర్ఎస్ నాయకులు మతితప్పి మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పైన విమర్శలు మానుకోకపోతే ప్రజలు రాబోయే రోజుల్లో వీరికి సరైన బుద్ధి చెబుతారని శేరీ సతీష్ రెడ్డి హెచ్చరించారు.

# కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పోచంపల్లి బ్యాంకు సేవలు

- పోచంపల్లి బ్యాంకు వ్యవస్థాపక ప్రమోటర్ కస్తూరి సుదర్శన్
- ఎల్బీనగర్ బ్రాంచ్ మేనేజర్ ఏసిహెచ్ నర్సింహ్మా రావు
- ఎల్బీనగర్ పోచంపల్లి బ్యాంకు బ్రాంచ్ లో ఖాతాదారుల సమావేశం
- పోచంపల్లి బ్యాంకు అందిస్తున్న సేవల పట్ల
- సంతోషం వ్యక్తం చేసిన ఖాతాదారులు





**మహేశ్వరం, మే 30, (ప్రజా జ్యోతి )** కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పోచంపల్లి బ్యాంకు సేవలు అందించడమే పోచంపల్లి బ్యాంకు లక్ష్యమని పోచంపల్లి బ్యాంకు వ్యవస్థాపక ప్రమోటర్ కస్తూరి సుదర్శన్,ఎల్బీనగర్ బ్రాంచ్ మేనేజర్ ఏసిహెచ్ నర్సింహ్మా రావు అన్నారు. ఖాతాదారులకు అన్ని రకాల సేవలు అందించడమే పోచంపల్లి బ్యాంకు ప్రధాన లక్ష్యమని వారు అన్నారు. గురువారం నాడు ఎల్బీనగర్లో పోచంపల్లి కో-ఆపరేటివ్ బ్యాంకు బ్రాంచ్ లో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పోచంపల్లి బ్యాంకు వ్యవస్థాపక ప్రమోటర్ కస్తూరి సుదర్శన్,ఎల్బీనగర్ బ్రాంచ్ మేనేజర్ ఏసిహెచ్ నర్సింహ్మా రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ బ్యాంకులు అందించని సేవలు కూడా పోచంపల్లి కోపరేటివ్ బ్యాంక్ అందిస్తుందని బ్యాంకు డిపాజిట్, లాకర్స్, మనీ ట్రాన్సాక్షన్స్ ప్రతి ఒక్కటి కస్టమర్లకు అనుకూలంగా ఉండే విధంగా కల్పించడం జరిగిందని అన్ని రకాల లోన్స్ కూడా కల్పించడం జరిగిందని వారు తెలిపారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందు లేకుండా బ్యాంకు సేవలు అందిస్తుందని ఎలాంటి ఇబ్బందులు ఉన్న నిర్భయంగా తెలియజేయాలని కోరారు. ఖాతాదారులు కొందరు మాట్లాడుతూ అన్ని బ్యాంకుల కన్నా సేవలందించడంలో పోచంపల్లి బ్యాంకు ముందంజలో ఉందని పోచంపల్లి బ్యాంకు అంటే మన బ్యాంకు మా బ్యాంకు అన్నట్టు మాకు భావన కలుగుతుందని వారు అన్నారు. ఫోన్ పే లో ఇబ్బందులు కలుగుతున్నాయని ఖాతాదారులు బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇంకా కొన్ని చిన్న చిన్న విషయాలు సమస్యలను పరిష్కారం చేయాలని సూచించారు. వాటిని బ్యాంకు పాలకవర్గం చైర్మన్ కు వివరించి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బ్యాంకు మేనేజర్ తెలిపారు.బ్యాంకు మరింతగా అభివృద్ధి కోసం అందరం కలిసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి బ్యాంకు వ్యవస్థాపక ప్రమోటర్ కస్తూరి సుదర్శన్,, బ్రాంచి మేనేజర్ నర్సింహ్మా రావు, బండి మధుకుమార్, వనం, సాయికుమార్, బోనగిరి. సాలుగణేష్, గంజి, వరమ్మ, డబ్బకర్ అభిషేక్, సంతోష్, ఊరబిండి, గంజి సరిత, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అక్కినపల్లి సాయికి

# పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వర్ రావు



**కూకట్‌పల్లి, మే 30 (ప్రజా జ్యోతి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయి పుట్టినరోజు సందర్భంగా గురువారం వివేకానందనగర్ కాలనీలోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నివాసంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, గోపాల్ రావు, శంకర్ రెడ్డి, పి. దుర్గాప్రసాద్ రావు, బుల్లెట్ శీను, సాయి, ఫణీంద్ర, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

# ఐలా స్థలంలో గోడను తొలగించి ప్రమాదాలను నివారించండి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, మే 30 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతే నగర్ డివిజన్ శివాలయం బస్తీకి సమీపంలో పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఐలా స్థలంలో గోడ నిర్మించడం వల్ల ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలుగుతుందా నేపథ్యంలో ప్రమాదాలకు కారణమవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆయా ప్రాంతాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో అనేకమంది వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఇదే ప్రాంతంలో బస్తీవాసులు అనేక మంది ఉన్నందున ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ కు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్ ల దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఎమ్మెల్యే కృష్ణారావు స్పందించి డిసి ఐల కమిషనర్, ఐలా జోనల్ కమిషనర్ తో చర్చించి స్థలం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమయ్య, ఎర్ర నరసయ్య, డేవిడ్, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# మౌలిక వసతుల కల్పనలో అన్ని పనుల్ని పూర్తి చేయాలి

– డీఈఓ సుశీంధర్ రావు – ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలల సందర్శన



**యాచారం, మే 30 (ప్రజాజ్యోతి):** అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన పాఠశాలాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అవసరమైన అన్ని పనులు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని డిఈవో సుశీందర్ రావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని ఎంపీ యుపిఎస్ గడ్డ మల్లాయగూడ, ఎంపీపీఎస్ మాల్ మార్కెట్ పాఠశాలలను గురువారం డీఈవో సుశీందర్ రావు సందర్శించి ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. పనుల నిర్వహణలో ఎక్కడ కూడా అలసత్వానికి తావివ్వకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు పూర్తి చేయాలని డిఇఓ సూచించారు. కార్యక్రమంలో గడ్డ మల్లాయగూడ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జగన్నాథ్, మాల్ మార్కెట్ ప్రధానోపాధ్యాయులు శ్రీలత పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి

– జిల్లా కలెక్టర్ శశాంక

– జూన్ 3 నుంచి 11 వరకు ప్రతిష్టాత్మకంగా బడిబాట కార్యక్రమం



**ఇబ్రహీంపట్నం, మే 30 (ప్రజాజ్యోతి):** జూన్ 3 నుంచి 11 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బడిబాట కార్యక్రమంలో బడి ఈడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. జూన్ 3 నుండి 11 వరకు చేపట్టనున్న బడిబాట, అనంతరం జూన్ 12 నుండి 19 వరకు రోజువారీగా చేపట్టనున్న కార్యక్రమాలపై ప్రభుత్వ మార్గదర్శకాలను అధికారులకు వివరించి సమర్ధవంతంగా అమలు చేయుటకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, తహసీల్దార్లు, ఎంపిపిలు, ఎంపిఓలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులను, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ సెక్రటరీలు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ తమ పరిధిలోని గ్రామాలలో చదువుకు దూరంగా ఉంటున్న బడి ఈడు పిల్లలను గుర్తించి దగ్గరలోని అంగన్వాడీలు, పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రధానంగా ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వ్యత్యాసం తెలుపుతూ ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమమని తల్లిదండ్రులలో వారిలో నమ్మకం కలిగించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న వసతులను గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. జూన్ 3 న బడిబాట కార్యక్రమంపై విలేజి ఆర్గనైజేషన్లతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. 4న ఇంటింటికి తిరిగి బడిఈడు పిల్లలను గుర్తించాలన్నారు. 5 నుండి 10 వరకు అంగన్వాడీ కేంద్రాలకు సందర్శించి తల్లిదండ్రులలో చదువు పట్ల అవగాహన కలిగించి పిల్లలను బడికి పంపేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 11న గ్రామ సభ ఏర్పాటు చేసి 3 నుండి 10 వరకు చేపట్టిన కార్యక్రమాలను చర్చించాలన్నారు. 12న పండుగ వాతావరణంలో పాఠశాలు పున: ప్రారంభించి నూతన విద్యార్థులకు స్వాగతం పలకాలన్నారు. 13న తొలిమెట్టు, 14న సామూహిక అక్షరాభ్యాసం, 15న గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, 18న డిజిటల్ తరగతులపై అవగాహన, 19న ఆటలపోటీలు నిర్వహించాలన్నారు. చక్కటి కార్యాచరణతో పక్కాగా ప్రణాళిక రూపొందించి అధికారులందరూ సమన్వయంతో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీ ఈఓ సుశీందర్ రావు, పిడి డిఆర్డిఏ శ్రీలత, వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, డీపీఓ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

– మరణించిన వ్యక్తి బిచ్చగాడుగా గుర్తించిన పోలీసులు

**మహేశ్వరం,(బాలాపూర్)మే 30, (ప్రజా జ్యోతి )** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం గురువారం నాడు సుమారు 16:00 గంటలకు ఫిర్యాదుదారుడు జల్పల్లి గేట్ నుండి జల్పల్లి గ్రామానికి వెళ్తుండగా, ఈలోగా అతను ఆక్సిజన్ కంపెనీ దగ్గరకు చేరుకుని, రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండడం చూశాడు. ఫిర్యాదుదారు అక్కడికి వెళ్లి చూడగా గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి రెండు రోజుల క్రితం మృతి చెంది సుమారు 45 ఏళ్లు ఉంటాడు. ఫిర్యాదుదారుడు అప్పుడప్పుడు జల్పల్లిలోని దేశీ దాబా దగ్గర భిక్షాటన చేస్తూ గుర్తుతెలియని వ్యక్తిని చూశాడు. మరణించిన వ్యక్తి బిచ్చగాడు అని, సమయానికి సరిగా ఆహారం తీసుకోకపోవడం, అనారోగ్య సమస్యల వల్ల చనిపోయి ఉంటాడని ఫిర్యాదుదారుడు భావించాడు. కాబట్టి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుని కోరుతున్నారు. అందులోని అంశాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాలాపూర్ పోలీసులు తెలిపారు.



# కార్మిక హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తాం

– సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అలువాల రవికుమార్



**మహేశ్వరం, మే 30, (ప్రజా జ్యోతి )** సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహేశ్వరం మండల కేంద్రంలో సిఐటియు జెండాను భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు స్వర్ణగంటి చంద్రయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అలువాల రవికుమార్ మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం సిఐటియు సంఘం ఏర్పడి నేటితో 54 సంవత్సరాలు పూర్తయ్యాయి అన్నారు నాటి నుండి నేటి వరకు కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాట కొనసాగిస్తూనే అనేక విజయాలు సాధించిందన్నారు కనీస వేతనాలు చట్ట బద్ధ హక్కులు ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల హక్కులు మహిళలు దళితులు రక్షణ రంగం కార్మికుల కోసం అదేవిధంగా ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న ప్రభుత్వ విధానాల మీద నిరంతరం కార్మిక వర్గాన్ని చైతన్యం చేస్తూ ఉద్యమ బాట పట్టించి సమస్య పరిష్కారం అయ్యేవరకు కృషి చేసిన ఏకైక కార్మిక సంఘం సిఐటియు మాత్రమే అన్నారు. నేడు కార్మిక శాఖ అధికారులు యజమాన్యాలకు లొంగిపోయి యజమాన్యాల శాఖగా మారి కార్మికులకు అన్యాయం చేస్తున్న సందర్భంగా ప్రభుత్వాలు కూడా చూసి చూడనట్లు వదిలేస్తూ పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నారని అన్నారు. రెక్కాడితే డొక్కానిందని కడుపేదల కోసం పోరాడుతూ అనేక విజయాలను సాధించిన క్రమంలో అనేక మంది అమరవీరులైన వారి ఆశయ సాధన కోసం నేటికీ పోరాటం కొనసాగిస్తూ కార్మిక రాజ్య స్థాపన కోసం ఆర్థిక రాజకీయ సామాజిక ఉద్యమాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జోరాల శ్రీశైలం, గ్రామ అధ్యక్షులు స్వర్ణకంటి చంద్రయ్య, కటికల శంకర్, కానపురం చెన్నయ్య, గద్దగూటి రాములు, కిషన్, మల్లేష్, మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల నివారణకు కలిసికట్టుగా పని చేయాలి

– విత్తనాలు, ఎరువులు విక్రయించే సమయంలో రసీదు కచ్చితంగా ఇవ్వాలి

– నోటీస్ బోర్డ్ పై విత్తనాలు ఎరువుల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి





**కొడంగల్ మే 30 ప్రజా జ్యోతి న్యూస్ :** నకిలీ విత్తనాల నివారణకు అందరూ కలిసికట్టుగా పని చేసి నకిలీ విత్తనాలను రూపుమాపుదామన్ని ఏ డి ఏ శంకర్ రాథోడ్. సీఐ శ్రీధర్ రెడ్డిలు అన్నారు. కోడంగల్ లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో కోడంగల్.దౌల్తాబాద్.బోంరాస్ పేట్ మండలాల విత్తనాలు, ఎరువుల డీలర్లతో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సరిపడ్డ విత్తనాలు. ఎరువులు అందుబాటులో ఉంచి నిబంధనల మేరకు అమ్మకాలు జరపాలన్నారు. లైసెన్స్ పొందిన డీలర్లు ఈపాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులు విత్తనాలు విక్రయించాలని పేర్కొన్నారు. విత్తనాలు. ఎరువులు విక్రయించే సమయంలో కచ్చితంగా రసీదు రైతులకు అందించాలని సూచించారు. ఆదికృత డీలర్లు అందుబాటులో ఉన్న విత్తనాల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నోటీస్ బోర్డ్ పై నమోదు చేయాలని ఆదేశించారు. విత్తన వ్యాపారులు తమ దుకాణాలలో తప్పనిసరిగా రిజిస్టర్ నిర్వహించాలని పంట రకము. ల్యాట్ నెంబర్. విత్తన పరీక్ష తేదీ. కాలం గడువు తేదీ. రైతు పేరు వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు దుకాణాలు తనిఖీ చేస్తారన్నారు. లైసెన్స్ కొనుగోలుదారులకు కనిపించే విధంగా పెట్టాలని. ధరల పట్టిక రైతులకు కనిపించే విధంగా ఉంచాలన్నారు. వ్యవసాయ శాఖ. పోలీస్ శాఖ టీం ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల నివారణకు కృషి చేస్తున్నామన్నారు. లూజ్ విత్తనాలు ఎవరైనా అమ్ముతున్న వ్యవసాయ శాఖ. పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. లూజ్ విత్తనాలు వాడడం వల్ల పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం కూడా తగ్గుతుందన్నారు. డీలర్ల దగ్గర కొనుగోలు చేసిన విత్తనాల రసీదును రైతులు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. లూజు విత్తనాలు నివారించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రైతులు విత్తనాలను నాటుకోవాలంటే భూమిలో 60 శాతం తేమ ఉన్నప్పుడు నాటుకుంటే మొలకెత్తుతుందని రైతులకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో లు లావణ్య. పద్మావతి. కొడంగల్. దౌల్తాబాద్.బోంరాస్ పేట్ మండలాల విత్తనాల. ఎరువుల డీలర్లు. ఏఈవోలు పాల్గొన్నారు.

## ఇంట్లో చోరీ: పలు అనుమానాలతో కేసు నమోదు



**శివ్వంపేట ప్రజాజ్యోతిబీ**శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో మన్నె రవి ఇంట్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ కి పాల్పడ్డారు,ఈ విషయంపై ఎస్సై మహిపాల్ రెడ్డి ని వివరణ కోరగా,,,,, ఫిర్యాదు అందింది అని,వెండి వస్తువులు (నగలు) పోయినాయని బాధితులు చెప్పారని, సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని,చోరీ పై పలు అనుమానాలు ఉన్నాయని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు,

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



**శివ్వంపేట ప్రజాజ్యోతిబీ** మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న చేదు ఘటన రత్నాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది,ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం,,,,,,,శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి లక్ష్మీ భర్త కీ. శేరఘుపతి కొడుకు అయినా కమ్మరి సత్యనారాయణ (35) మద్యం తాగి వచ్చి రోజు ఇంట్లో గొడవపడేవాడు అని రోజులాగే బుధవారం మద్యం తాగి వచ్చి భార్య స్వాతి తో గొడవ పడగ స్వాతి ఆమె పిల్లలు తీసుకొని అమ్మగారింటికి వెళ్లిపోయింది,దీంతో సత్యనారాయణ తీవ్ర మనస్థాపానికి గురై రాత్రి 01.00 గంటలకు అందరూ పడుకున్నా సమయంలో ఇంటి పక్కన ఉన్న చింత చెట్టు కి ఉరి వేసుకుని చనిపోయాడని,తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసిందని,కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు,

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు





**శివ్వంపేట ప్రజాజ్యోతిబీ**దైవ దర్శనానికి వెళ్తున్న ఆటో అదుపు తప్పి ప్రమాదానికి గురి కావడంతో మనేపల్లి మల్లేషం కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి,అనుకోని ప్రమాదం జరగడంతో దిక్కుతోచం పరిస్థితిలో కుటుంబ సభ్యులు,,అపన్న హస్తం కోసం ఎదురుచూపులు,శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన మనేపల్లి మల్లేషం కొడుకు చరణ్,కుటుంబ సభ్యులతో దైవ దర్శనానికి ఆటో లో వెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటో బోర్లా పడడంతో చరణ్ కు కంటి బొక్క విరిగి,తలకు తీవ్ర గాయాలయ్యాయి,ఆపరేషన్ కు 2లక్షల వరకు ఖర్చు అవుతుంది అని డాక్టర్లు చెబుతున్నారు అని ఎమర్జెన్సీ లో ఉన్నాడు,కుటుంబ సభ్యులు తెలిపారు,దాతలు ముందుకు చరణ్ ఆపరేషన్ కు ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు,గ్రామస్తులు కోరుతున్నారు, ఫోన్ పే,గూగుల్ పే,9848007667

## బోరు మోటర్ కేబుల్‌ను దొంగలించిన దుండగులు

**రెంజల్ ప్రజా జ్యోతి మే 30 :** రెంజల్ మండలంలోని దండిగుట్ట మరియు వీరన్న గుట్ట గ్రామ శివారులో గల బోరు మోటర్ కేబుల్ ను గుర్తుతెలియని దుండగులు దొంగలించినట్లు రైతులు వాపోయారు. వేసవికాలం పంటను వేసిన తర్వాత రైతులు వర్షాకాల పంట కోసం నారుమలను సిద్ధం చేసుకునేందుకు వెళ్లి శివారులో పొలాలను పరిశీలించగా అక్కడ ఉన్నటువంటి బోరు మోటర్ల కేబులు తోపాటు, స్టార్టర్ల డబ్బాలను కూడా గుర్తు తెలియని దుండగులు ఎత్తుకు వెళ్ళినట్లు గుర్తించారు. దొంగిలించినటువంటి దుండగులను గుర్తించి రైతులను కాపాడాలని కోరుతున్నారు. పోలీసులకు సమాచారాన్ని అడగక తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ తెలిపారు.

## జహీరాబాద్ పార్లమెంట్లో భారీ మెజారిటీతో గెలుపు బీజేపీదే

– భారీ మెజారిటీతో విజయం సాధించనున్నట్లు బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ ధీమా వ్యక్తం



**కల్హేర్ మే 30(ప్రజాజ్యోతి): సంగారెడ్డి** జిల్లా కల్హేర్ మండల పరిధిలోని మాసన్ పల్లి కూడలిలో గల వెంకటాద్రి ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమీక్ష సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ వారీగా ఎన్నికలు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు, నాయకులు తన విజయం కొసం కృషి చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ టికెట్ కేటాయించినందుకు మోదీ, అమిత్ షా, నడ్డా గార్లకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారీ పెద్దోల గంగారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రవి కుమార్ గౌడ్, కో కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు విజయపాల్ రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మండల అధ్యక్షులు యెన్నం అనిల్ రెడ్డి, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఖేడ్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి: కుర్మా హన్మండ్లు



**సిర్గాపూర్ మే 30(ప్రజాజ్యోతి):**సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన సంఘం అధ్యక్షుడు కుర్మా హన్మండ్లు గురువారం మాట్లాడుతూ... వెనుకబడిన ఖేడ్ నియోజకవర్గనికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్ రెడ్డిని మంత్రి పదవి దక్కితే ఖేడ్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఉన్న నియోజకవర్గం అభివృద్ధిపథంలో నడుస్తాయని అన్నారు. ఇందుకోసమే ఇప్పటివరకు ఖేడ్ నియోజకవర్గం అభివృద్ధి వెనుకబడి ఉందని స్పష్టం చేశారు. ఈసారి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి క్యాబినెట్ మంత్రి పదవిలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డిని తీసుకోగలరని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

## మరి ఇంత దారుణమా..తుక్కుగూడ జాగృతి మహిళా కళాశాలకు తాళం

– డిగ్రీ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్ష ఎలా రాయాలి

– సెల్లార్‌లో కుర్చోపెట్టి పరీక్ష రాసిన వైనం – విద్యాశాఖ అధికారులు ఏక్కడ ఉన్నారో

– కాలేజీ యజమాని తక్షణమే చర్యలు తీసుకోవాలి – ఏబీవీపీ నాయకుడు సాయి చరణ్



**మహేశ్వరం,(తుక్కుగూడ) మే 30, (ప్రజా జ్యోతి )** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ లో జాగృతి మహిళా కళాశాల లో డిగ్రీ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్ష రాయడానికి వచ్చారు. కాలేజీ వద్దకు వచ్చి చూస్తే కాలేజీ కి తాళం వేసి ఉంది. చాలా సేపు వరకు విద్యార్థులకు ఏమీ అర్థం కాలేదు బిల్డింగ్ ఓనర్ నాకు కిరాయి ఇవ్వడం లేదని తాళం వేశాను అని చెప్పారు. దీంతో విద్యార్థులు ఆందోళన చేశారు. చివరకు విద్యార్థులను ప్రాక్టికల్ పరీక్ష కాలేజి లోని సెల్లార్ లో కుర్చోపెట్టి పరీక్ష రాయించడం జరిగింది. విశయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకుడు సాయి చరణ్ కళాశాల వద్దకు వెల్లి కాలేజి యాజమాన్యం తో తక్షణమే విధ్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలి అని లేదా ఏబీవీపీ చూస్తు ఊరుకోదు అని తెలిపారు. ఇంకా జరిగిన విద్యాశాఖ అధికారులు కాలేజీ తేజమాన్యం పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డురం గా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరొకసారి ఇలా జరగకుండా కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే జాగృతి కళాశాల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు సమస్యను పరిష్కారం చేయాలన్నారు.

## ఉపాధ్యాయులకు (ఈఎల్ఎస్) సంపాదిత సెలవులు మంజూరు చేయాలి

– ఉపాధ్యాయ సంఘులు



**పరిగి, మే 30 : (ప్రజా జ్యోతి)** పిఆర్టియు తెలంగాణ మండల శాఖ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో (వేసవిలో పనిచేసిన) జడ్పిహెచ్ఎస్, ఎంపియుపిఎస్, ఎంపిపిఎస్, పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులకు (ఈఎల్ఎస్) సంపాదిత సెలవులు మంజూరు చేయాలని పరిగిలో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంపిడిఓ, ఎంఈఓ, పరిగి స్పెషల్ ఆఫీసర్ కి వివిధ సంఘాల ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టి ఎస్ పరిగి మండల శాఖ అధ్యక్షుడు కావలి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి మంచనపల్లి శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు శంకర్ రావు, ఎస్టియు టిఎస్ నాయకులు దయాకర్, టిపియుఎస్ కార్యదర్శి విజయ్ నాయకులు, పిఆర్టియు రాష్ట్ర నాయకులు, రామాంజనేయులు, విరేశం, ఉస్మాన్ అలీ, రాజశేఖర్ రెడ్డి, వివిధ సంఘాల, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొని ఇట్టి విషయాన్ని జిల్లా అధికారి దృష్టి కి తీసుకెళ్లాలని తెలిపారు.